సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం : 4 : మే : 2023



**కనులపండువగా ఉత్సవాలు**

వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. 8లో



**ముగిసిన జాతర**

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ అన్నారు. 8లో



**లారీపై కూలిన చెట్టు**

మండల కేంద్రం అనంతగిరిలో ప్రధానరోడ్డుపై వెళ్తున్న లారీపై స్థానిక పీహెచ్‌సీ సమీపంలో చెట్టు విరిగిపడింది. 8లో

## న్యూస్‌రీల్

### ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

**చింతూరు:** జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2023–2024 విద్యా సంవత్సరానికి ఉచిత విద్యకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీంబాషా బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు ఉచితంగా కల్పించాల్సి ఉందన్నారు. రెండోదశ ప్రవేశాలకు ఈనెల 6 నుంచి 15 వరకు అర్హులైన వారు ఆన్‌లైన దరఖాస్తులను సమర్పించాలని, పూర్తి వివరాలకు గ్రామ సచివాలయాల్లో ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను సంప్రదించాలని డీఈవో సూచించారు. సచివాలయాల డేటా ఆధారంగా విద్యార్థుల అర్హతను పరిశీలించి ఈనెల 22న లాటరీ విధానంలో ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 24 నుంచి 28 వరకు ప్రవేశాలు పొందవచ్చని డీఈవో సూచించారు.

### సిగినాపల్లి క్వారీపై నిఘా



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

**చింతపల్లి:** చింతపల్లి డివిజన్ పరిధిలోని సిగినాపల్లి రంగురాళ్ల క్వారీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అటవీశాఖ రేంజ్ అధికారి జగదీశ్వరరావు తెలిపారు. క్వారీలో తవ్వకాలు జరగకుండా ప్రత్యేకంగా బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగువ నుంచి కొట్టుకు వచ్చిన మట్టిని గిరిజనులు పరిశీలించడాన్ని గమనించామన్నారు. తవ్వకాలు జరుపవద్దని సిగినాపల్లి కొండ చుట్టూ ఉన్న నల్లబిల్లి, దొడ్డికొండ, తీములబంద, గుర్రాలగొంది, కడుగుల, సంకాడ, గండేంపల్లి, పులుసుమామిడి, అన్నవరం తదితర గ్రామాల గిరిజనులకు అవగాహన కల్పించినట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నూకరాజు, బీట్ ఆఫీసర్ జి.వి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ దారుల ఈకేవైసీకి 8 వరకు గడువు



జిల్లా ఖజానా అధికారి ప్రసాద్‌బాబు

**సాక్షి,పాడేరు:** జిల్లాలోని విశ్రాంత ఉద్యోగ పెన్షన్‌దారులంతా ప్రభుత్వ ఉత్తర్వు మేరకు ఈ నెల 8వ తేదీ లోపు ఈకేవైసీ నమోదు పూర్తిచేసుకోవాలని జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి ఆర్.ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు జిల్లాలోని పెన్షనుదారులు తమ సిఫ్ఎంస్ ఐడీకి ఆధార్ కార్డుతో అనుసంధానం అయిన ఫోన్ నంబరును, ప్రస్తుత నివాస చిరునామాను విధిగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. అప్పటి ఫోన్ నంబరు అందుబాటులో లేకుంటే ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఫోన్ నంబరును ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఖజానా కార్యాలయాలకు లేదా పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయాలకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. దీనివల్ల ప్రతీ విశ్రాంత ఉద్యోగి సాంకేతికతతో కూడిన ఆర్థిక భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు పాడేరు 9866121278, అరకు 9490812976, చింతపల్లి 9440307050, రంపచోడవరం 9182935313,9441242676, చింతూరు 9951602121,9666775775, అడ్డతీగల 8074239606 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### నేటి నుంచి నివాస గృహాల అంచనాకు సర్వే

**వీఆర్‌పురం:** పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలో ప్రయారిటీ హాబిటేషన్‌గా నోటిపై అయిన మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఈ నెల 4వ తేదీ నుంచి నివాస గృహాల విలువ అంచనాపై సర్వే చేస్తారని తహసీల్దార్ ఎన్.శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ గ్రామాల్లో గత నెల 25వతేదీ నుంచి స్ట్రక్చర్ వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని ఆయన చెప్పారు. విలువ అంచనా విధానంపై సర్వే సిబ్బందికి ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో సర్వే సిబ్బంది మరోసారి లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి గృహాలకు సంబంధించి పూర్తి కొలతలతో పాటు ఇంటి రకం ,పైకప్పు ,ఇతర కట్టడాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి నమోదు చేసుకుంటారని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా ఆర్అండ్‌బీ శాఖ ఆధర్యంలో విలువ అంచనా కట్టి సదరు ప్రతిని భూసేకరణ ప్రత్యేక కలెక్టరుకు సమర్పించడం జరుగుతుందన్నారు.లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని సర్వే సిబ్బంది పీఎస్ నోటిఫికేషన్ ఆధారంగా ప్రతీ గృహాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకుంటారని తహసీల్దార్ తెలిపారు.

# విశాఖ.. వైభోగం

- భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటా సెంటర్‌తో మారనున్న ముఖచిత్రం
- నాలుగు నెలల్లో వైజాగ్ టూ భోగాపురం ఆరులైన్ల రహదారి పనులు
- సీఎం జగన్ పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర
- సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన : ముఖ్యమంత్రి పునరుద్ఘాటన



డేటా సెంటర్ నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, విశాఖపట్నం:** గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన, డేటా సెంటర్‌కు భూమి పూజ చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరాన్ని అభివృద్ధిలో మరో మెట్టు ఎక్కించారు. ఆర్థిక రాజధానిగా భాసిల్లుతున్నా.. ప్రధాన నగరాలతో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నా.. ద్వితీయ శ్రేణి నగరంగానే మిగిలిపోయిన విశాఖను.. టైర్–1 సిటీల సరసన నిలబెట్టేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రగతి పరుగును ప్రారంభించారు. ముఖ్యమంత్రి పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర.. ఇకపై తమ ప్రాంతాన్ని వలసల ప్రాంతమని కాకుండా, విప్లవాత్మక అభివృద్ధి కేంద్రంగా పిలవాలంటూ నినదించింది. సెప్టెంబర్ నుంచి విశాఖ నుంచి పరిపాలన ప్రారంభిస్తానంటూ సీఎం పునరుద్ఘాటించడంతో ఇక్కడి ప్రజల్లో ఉత్సాహం మరింత జోరందుకుంది.

ప్రపంచంలో ఏ నగరం చూసుకున్నా కనెక్టివిటీతోనే అభివృద్ధి చెందింది. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నా భారత నౌకాదళంతో అనుసంధానమై ఉంది. దీంతో విదేశాలకు విమానాలు ఎగిరే అవకాశాలు తక్కువగా ఉండటంతో అభివృద్ధిలో అంతంతమాత్రంగానే మిగిలిపోయింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాకతో ఇకపై ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెరగనుంది. తద్వారా ఉత్తరాంధ్ర, సరిహద్దు జిల్లాలు అభివృద్ధి పథంలో పరుగులు పెట్టనున్నాయి. ఎయిర్‌పోర్టు రాకతో ఈ ప్రాంత ఎకానమీ మారనుంది. అందుకే భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి 2026 నాటికి తొలి విమానం ఎగరనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులొచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ ఎయిర్‌పోర్టును రూ.4,592 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

**విశాఖ–భోగాపురం.. ఆరు లైన్ల రాదారి**

పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనున్నారు. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. అందుకే మహా నగరాన్ని భోగాపురంతో అనుసంధానించేందుకు ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కూడా జరగనుంది. మరో నాలుగు నెలల్లో దీనికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఆరులైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేను రెండు భాగాలుగా నిర్మించనున్నారు. హైవే రాకతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

**ఆసియా డేటా సెంటర్ రాజధానిగా విశాఖ**

మధురవాడలోని హిల్–4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకే పరిమితం కాదు. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్లను 190 ఎకరాల్లో రూ.21,844 కోట్లతో అదానీ సంస్థ నిర్మిస్తోంది. ఏడేళ్లలోపు పూర్తికానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు రానున్నాయి. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. విశాఖ నగరం డిజిటల్ రంగంలో ఆసియాకు రాజధానిగా భాసిల్లనుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2030 నాటికి 1 గిగావాట్ డేటా సెంటర్‌గా ఇది దశలవారీగా అభివృద్ధి చెందనుంది. డేటా స్టోరేజ్ పెంచడంతో పాటు కృత్రిమ మేధ ఆవశ్యకత తెలిపేలా డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి. సింగపూర్ నుంచి సబ్ మెరైన్ కేబుల్‌ను తీసుకొస్తూ.. డేటాసెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఇంటర్నెట్ డౌన్‌లోడ్ స్పీడ్ మరింత పెరగనుంది. దీని ద్వారా పరిశ్రమలకే కాకుండా.. ప్రజలకు కూడా ఈ ప్రాజెక్టు వరంలా మారనుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధిని ఓ ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయడం తమ అభిమతం కాదనీ.. ఒక ప్రాజెక్ట్ ఏర్పాటైతే.. ఆ ప్రాంతంతో పాటు దాని పరిసరాలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న కాన్సెప్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని సీఎం జగన్ స్పష్టం చేశారు.

**త్వరలోనే ప్రథమ శ్రేణి నగరంగా..**

దక్షిణ భారత దేశంలోనే మోస్ట్ అడ్వాన్స్‌డ్ సిటీగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా.. ఫిన్‌టెక్ హబ్‌గా.. ఇలా విభిన్న రంగాల్లో దూసుకుపోతున్న విశాఖ.. ఇంకా ద్వితీయ శ్రేణి నగరంగానే ముద్రపడిపోయింది. అందుకే వైజాగ్‌ను ప్రథమ శ్రేణి నగరాల సరసన చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. అలాగే సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగానే పరిపాలన సాగిస్తామంటూ ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు.



అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

## సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం





సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

**గోపాలపట్నం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్‌తో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం ఉదయం 9.37 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ తదితరులు సీఎంకు పుష్పగుచ్ఛం అందించి.. స్వాగతం పలికారు. 9.56 గంటలకు హెలికాప్టర్‌లో ఆయన భోగాపురం పయనమయ్యారు. ఆయన వెంట మంత్రి అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు వెళ్లారు. విజయనగరం, విశాఖలో కార్యక్రమాలు ముగించుకున్న సీఎం జగన్.. వర్షం కారణంగా రోడ్డు మార్గంలో బయలుదేరి 4.28 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 4.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు వెళ్లారు.

### పర్యటన సాగిందిలా..

విశాఖ విమానాశ్రయానికి బుధవారం ఉదయం 9.37 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం జగన్ అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం బయలుదేరారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ హిల్–3కి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హిల్–4కి చేరుకుని అదానీ డేటాసెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

తర్వాత రుషికొండలోని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసానికి చేరుకున్నారు. ఎంపీ కుమారుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులను ఆశీర్వదించారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉండగా.. వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డా.బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, కన్నబాబు, గొల్ల బాబూరావు, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎంఎస్ఎంఈ చైర్మన్ ఆడారి ఆనంద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

# కుమ్మరించిన వాన!

- పలుచోట్ల భారీ వర్షం
- నేడూ కురిసే అవకాశం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇబ్బందులు పడిన ప్రజలు



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం



తంటికొండలో ఇళ్లమధ్య నిలిచిపోయిన వర్షం నీరు

**సాక్షి, విశాఖపట్నం:** వాన కుమ్మరించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరలు తెరలుగా కురుస్తూనే ఉంది. జనజీవనానికి అంతరాయం కలిగించింది. ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్ష తీవ్రత అధికంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. అల్లూరి జిల్లా అరకులో 4.8, కొయ్యూరులో 3.6, రాజవొమ్మంగిలో2.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరదనీరు భారీగా ప్రవహించింది. సంతబయలు, ఇందిరా కాలనీల్లో వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగాలులకు జీడిమామిడి తోటలకు నష్టం వాటిల్లింది.

**కొయ్యూరు:** మండలంలో సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది.

**అరకులోయ రూరల్:** మండల కేంద్రం అరకులోయలో బుధవారం భారీ వర్షం కురిసింది. రాకపోకలు, జనజీవనం స్తంభించింది.

**నీటమునిగిన ఇళ్లు**

**రాజవొమ్మంగి:** ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని తంటికొండ గ్రామాన్ని వరద నీరు ముంచెత్తడంతో దాదాపు పది ఇళ్లు నీటి మునిగాయి. ఈ గ్రామం మీదుగా ఉన్న వట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువకు వరద పోటు రావడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు.ఈ గ్రామాన్ని ఆనుకొని ఎన్‌హెచ్ 516 నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎత్తుగా నిర్మించిన రహదారి కూడా ఇందుకు కారణమని గ్రామస్తులు తెలిపారు. ముంపు సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కాఫీ రైతులకు బాసటగా సేవలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి,పాడేరు:** ఏజెన్సీలోని కాఫీ రైతులకు ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు, లైజన్ వర్కర్లు అన్ని విధాలుగా అండగా ఉండి, కాఫీతోటల అభివృద్ధి, విస్తరణను ప్రోత్సహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తన సమావేశ మందిరంలో కాఫీ పంట సాగు విస్తీర్ణంపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

**నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం**

కాఫీ మొక్కల నర్సరీ కోసం వినియోగిస్తున్న పాలథిన్ బ్యాగ్స్ నాణ్యతగా లేకపోవడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ మండిపడ్డారు. నాసిరకం బ్యాగ్స్‌ను ఎందుకు తీసుకున్నారని లైజన్ వర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఉన్న మూడు రకాల నాణ్యమైన పాలిథిన్ బ్యాగ్‌ల నమూనాలను తెప్పించాలని, వాటి నాణ్యతలో తేడాలపై విశ్లేషించి వాటి నాణ్యత ప్రమాణాలను తనకు సమగ్రంగా వివరించాలని ఆదేశించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి టోకుగా ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యత లేని పాలిథిన్ బ్యాగులను సరఫరా చేసిన వ్యాపారులకు బిల్లులు చెల్లించవద్దని ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలెక్టర్ ఆదేశించారు. పొదలు తొలగింపు లాంటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా కాఫీతోటల్లో మొక్కలు చనిపోయి, గ్యాపులుంటే ఏకీకరణ చేపట్టాలని, అందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించి కేంద్ర కాఫీ బోర్డుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నర్సరీలలో మొక్కలు నిల్వ ఉంచకుండా, అన్ని మొక్కలు సరఫరా చేయాలని, 45 రోజుల తరువాత జూన్ 15 నాటికి మొక్కల ఎదుగుదలపై తమకు నివేదికలు సమర్పించాలని సూచించారు. రైతులకు సరఫరా చేసిన మొక్కల రకాలు, పాలిథిన్ బ్యాగ్‌ల వివరాలను తమ రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ ఏడీ ఎస్.అశోక్, కాఫీ బోర్డు ప్రతినిధులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న ఏఎస్పీ జగదీష్ అదహళ్లి



క్రికెట్ ఆడుతున్న ఏఎస్పీ జగదీష్ అదహళ్లి

- ఏఎస్పీ జగదీష్ అడహళ్లి
- క్రికెట్ టోర్నీ ప్రారంభం

**గంగవరం :** క్రీడలు శారీరక ధారుడ్యంతోపాటు మానసిక ఉల్లాసం, మానసిక బలాన్ని చేకూరుస్తాయని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాళికల అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గంగవరం యువసేన, ఓల్డ్ టైగర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివంగత మాజీ సర్పంచ్ కలుముల కామరాజుదొర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ 2023ను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన జరిగిన టోర్నీ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. యువత చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో ఇటువంటి క్రీడాపోటీల నిర్వహణకు తమ శాఖ తరఫున కూడా ప్రోత్సాహం అందిస్తామని ఏఎస్పీ తెలిపారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ మంచి ఆటగాళ్లుగా రాణించాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు, దివంగత కామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. గ్రామసర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో అడ్డతీగల సీఐ వై.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ఎంపీపీ కుంజం గంగాదేవి, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావుదొర, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి దిండినాగమహేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు భావన,కెవిన్, ఎస్ఐ చిన బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నీలో 11 మండలాలకు చెందిన 46 జట్లు పాల్గొన్నాయి.

# గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా జాతర

- మోదమ్మ ఉత్సవాలకు అన్నిశాఖల సహకారం
- కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో మిగతా అధికారులు

**సాక్షి,పాడేరు:** గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాడేరులో మోదకొండమ్మ జాతర నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14,15,16 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి జాతర ఏర్పాట్లపై అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండవ విడత సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతర విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు.

**ప్రత్యేక ట్యాంకర్లతో తాగునీరు..**

పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జాతర జరిగే మూడు రోజులు నిరంతరం రెండు షిఫ్టుల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని పంచాయతీ విభాగం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేకంగా ట్యాంకర్లతో సురక్షిత నీటిని సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్ల వినియోగంతో పాటు,అదనంగా మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యశిబిరాలు ఏర్పాటుతోపాటు మూడు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పటిష్టమైన బందోబస్తుతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జాతరకు వచ్చే వారి సౌకర్యార్థం తగినన్ని బస్సులు అదనంగా నడపాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు.

**అన్ని శాఖల తరపున స్టాళ్లు**

అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని గిరిజన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని ఇందుకు ఉపాధ్యాయ వర్గాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని,గిరిజన సంక్షేమశాఖ డీడీ, డీఈవోలను ఆయన ఆదేశించారు. జేసీ జె.శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఏఎస్పీ కె.ధీరజ్, అసిస్టెంట్ కలెక్టర్ అశితోష్ శ్రీవాత్సవ, గిరిజన సంక్షేమశాఖ డీడీ, ఐ.కొండలరావు, డీపీవో కొండలరావు, ఈఈలు బాలసుందరబాబు, లీలాకృష్ణ, అప్పారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులు నవర మోదకొండబాబు, తమర్బ ప్రసాదరావునాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మర్రి కామయ్య వర్ధంతికి ప్రత్యేక ఏర్పాట్లు

**హుకుంపేట:** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం విప్లవ కారుడు మర్రి కామయ్య వర్ధంతిని ఈనెల 5వ తేదీన నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజుతో కలిసి పోరాడిన వారిలో కామయ్య ఒకరని అన్నారు. సమరయోధుడు మర్రి కామయ్య చరిత్రను అందరికీ తెలిసేలా చర్యలు చేపడుతునామన్నారు. హుకుంపేట మండలంలోని మర్రి కామయ్య సమాధి వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మర్రి కామయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.

### సీఎం జగన్‌కు వినతి

**మహారాణిపేట :** విశాఖ పర్యటనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర నగరంలో కలిసి వినతిపత్రం అందించారు. పంచాయతీ రాజ్‌లో డీఎల్‌డీవో పోస్టుల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించి, సంబంధిత ఉత్తర్వులను పునఃపరిశీలించాలని కోరారు.

### ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

**గంగవరం :** పోలీసు సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని, గంజాయి, సారా వంటి అక్రమ రవాణా , అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంచాలని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్ళి అన్నారు. మండలకేంద్రంలో పోలీసు స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. మండలంలో క్రైం రేట్ వివరాలను సీఐ రాంబాబు, ఎస్ఐ చినబాబు ఏఎస్పీ జగదీష్‌కు వివరించారు. ఆయనకు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

### స్టీల్‌ప్లాంట్ సీఎండీకి ఫైనాన్స్ డైరెక్టర్ బాధ్యతలు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు డైరెక్టర్ (ఫైనాన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వి.వి. వేణు గోపాలరావు ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయడంతో, ఆ బాధ్యతలను సీఎండీకి అప్పగించారు.



# కనులపండువగా ఉత్సవాలు



కోలాటం ఆడుతున్న మహిళలు

- భక్తి శ్రద్ధలతో వెంకన్న కల్యాణ వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శక్తి వేషధారణలో కళాకారులు

**అరకులోయ రూరల్:** మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు రోజున స్వామి వారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా శక్తి వేషధారణ, బిందెల డ్యాన్స్, కోలాటం , తీన్మార్, పులివేషాలు ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆలయం నుంచి అరకులోయ ప్రధాన రహదారిలో వైఎస్సార్ జంక్షన్ మీదుగా స్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు సాగింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించారు.ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలరాం, కమిటీ సభ్యులు కృష్ణారావు, గుప్త, అర్జున్, రామారావు, బాబూరావు, సర్పంచ్ దాసుబాబు, చందుపాడి, రమేష్, హరి, రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



- సైబర్ నేరగాళ్ల బాధితుల్లో యువతే ఎక్కువ
- 1930 టోల్‌ఫ్రీని సంప్రదించండి –ఎస్పీ మురళీకృష్ణ

**సాక్షి, అనకాపల్లి:** సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయిన వారిలో ఎక్కువగా యువతే ఉన్నట్టు పేర్కొన్నారు. రోజురోజుకూ కొత్తకొత్త నేరాలతో సైబర్ కేటుగాళ్లు ఆర్థికంగా, మానసికంగా బాధితుల్ని వేదనకు గురి చేస్తున్నారని, దీనిపై ప్రజలు మరింత జాగ్రత్త వహించాలన్నారు. బ్యాంక్ అకౌంట్, ఏటీఎం పిన్, ఆధార్, పాన్ వివరాలను అపరచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఆర్థిక మోసానికి గురైతే తక్షణమే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉద్యోగావకాశాలను సెర్చ్ చేసేటపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగం ఇస్తామని కాల్ చేసి జాయినింగ్ ఫీజ్ కట్టాలని అడిగితే అది ఖచ్చితంగా మోసమేనని గుర్తించాలన్నారు. కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్లో వెతికే సమయంలో, మరోసారి ఆ నంబర్‌ను నిర్ధారించుకోవాలని సూచించారు. డేటింగ్ యాప్స్, సోషల్ మీడియాలో యువతుల అకౌంట్లతో మెసేజ్‌లు పంపేవారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# రేపు మెగా జాబ్‌మేళా

**కంచరపాలెం(విశాఖ ఉత్తర):** స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ(టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ తిరుపతి, ల్యాండ్ మార్క్ గ్రూప్, అరోవానా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, రాక్‌మన్ ఇండస్ట్రీస్, ఖజానా జ్యూయలరీస్, కాన్‌సెంట్రిక్స్, ఎక్స్ టెక్ టెస్టింగ్ లిమిటెడ్, ఐనాక్స్, వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు 435 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఏఎన్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీకామ్(టాలీ), బీటెక్ ఎంబీఏల్లో ఆయా ఉద్యోగాలను బట్టి అర్హులై ఉండాలని తెలిపారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పోస్టును బట్టి వేతనం నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

# చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



శివ సత్యనారాయణ మృతదేహం

**కశింకోట:** కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోలీసు కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన అవుపాటి శివసత్యనారాయణ(40) విశాఖ సిటీ ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 1న సొంత పనిపై బయ్యవరంలోని తన ఇంటి నుంచి స్కూటీపై అనకాపల్లి బయల్దేరారు. కశింకోట వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి స్కూటీ అదుపు చేయలేక రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ తెలిపారు. ఈ మేరకు భార్య రామసూర్య లీలాలలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

# లోకోస్ యాప్‌లో పొదుపు సంఘాల సమాచారం

వీవోఏ, సీసీల శిక్షణలో డీఆర్‌డీఏ జిల్లా ఐబీ ఏపీఎం చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జిల్లా ఐబీ ఏపీఎం చంద్రకళ

**దేవరాపల్లి:** పొదుపు సంఘాలు, సభ్యుల సమాచారం, జీవనోపాధుల స్థితిగతులు, ఆర్థిక పరమైన లావాదేవీలను దేశవ్యాప్తంగా ఇకపై లోకోస్ యాప్‌లోనే నమోదు చేయాలని డీఆర్‌డీఏ ఐబీ ఏపీఎం బి.చంద్రకళ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో వీవోఏలు, సీసీలకు శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా తొలి రోజు జిల్లా ఐబీ(ఇన్వెస్ట్‌మెంట్ బిల్డింగ్) ఏపీఎం చంద్రకళతో పాటు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి పలు సూచనలు చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం)లో భాగంగా ఇకపై పొదుపు సంఘాల వివరాలన్నీ లోకోస్ యాప్‌లోనే నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ బుక్ కీపింగ్ విధానం ద్వారా సంఘాలు, సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ప్రాజెక్టులో భాగంగా ఇకపై దేశమంతటా లోకోస్ యాప్ ద్వారానే వివరాలను పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని వీవోఏలు, సీసీలను సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం ఎస్.ప్రభాకర్, డీఆర్‌డీఏ క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్(ఎల్‌సీ) డి.ఉమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోదమ్మ ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



**సాక్షి,పాడేరు:** పాడేరులో ఈనెల 14,15,16 తేదీల్లో జరిగే మోదకొండమ్మతల్లి జాతరకు కుటుంబ సమేతంగా విచ్చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి ఆహ్వానించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రిని ఆమె, అరకు ఎమ్మెల్యే పాల్గుణ కలిశారు.

విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి







# ముగిసిన జాతర



విజేతలకు బహుమతులను అందజేస్తున్న చింతపల్లి డీఎఫ్‌వో సూర్యానారాయణపడాల్

**జి.మాడుగుల:** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ అన్నారు.మండల కేంద్రంలో మత్స్యమాడుగులమ్మ జాతర ఉత్సవాల నేపథ్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్, వాటీబాల్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలో విన్నర్ కుల్లుపాడు టీమ్‌కు రూ.25వేలు, షీల్డ్, రన్నరప్ చేపల్లి టీమ్‌కు రూ.10వేలు, షీల్డ్‌ను, వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు, షీల్డ్‌ను డీఎఫ్‌వో అందజేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన యువత క్రీడల్లోనూ రాణించాలన్నారు. శ్రీమత్స్యమాడుగులమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంలో ఢీ జోడీ ఫేమ్ మణికంఠ, నివేదిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు వరహాలరాజు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, మాజీ ఎంపీపీ రమణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, కార్యదర్శి నారాయణరాజు, సభ్యులు విశ్వేశ్వరరాజు, శ్రీను, నాగరాజు, గోపాల్‌రాజు, పురుషోత్తమరాజు, చందు, కూర్మన్‌రాజు, గణపతి, కళ్యాణం, కోటేశ్వరరావు, కొండబాబు, అనిల్ తదితరలు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలకు చేయూత



లక్ష్మీపురంలో బాధిత కుటుంబాలకు ఫిక్సిడ్ బాండ్లను అందిస్తున్న జీఎం సురేష్‌బాబు

**పెదబయలు:** కాకినాడ ఆయిల్ కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల చొప్పున చెక్కుల రూపంలో అందించినట్టు గ్రామీణ వికాస్ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.పసురేష్‌బాబు అన్నారు. మండలంలోని పెద్రైడ పంచాయతీ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఐదు బాధిత కుటుంబాల సభ్యులు కొర్ర నీలమ్మ, వెచ్చంగి పోర్తిమ, కుర్తాడి నీలమ్మ, వెచ్చంగి సీతారాం, వెచ్చింగి లక్ష్మీ కుటుంబాల్లో ఒక్కో కుటుంబానికి రూ. 48 లక్షల చొప్పున రూ.2.40 కోట్లతో 51 ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లను బాధిత కుటుంబాలకు అందించారు. అలాగే ఏపీజీవీబీ అందిస్తున్న సేవలకు గ్రామస్తులకు వివరించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రతీ ఒక్కరూ సంపాదించిన వాటిలో కొంత భాగం పొదుపు చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ అలవాటుతో కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయన్నారు. బొండాపల్లి పంచాయతీ సర్పంచ్ బి.మత్స్యరాజు, మాజీ ఎంపీపీ కొండయ్య, పెదబయలు బ్రాంచ్ బ్యాంకు మేనేజర్ పవన్ సాయి, సిబ్బంది, బ్యాంకు మిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

# లారీపై కూలిన చెట్టు

- క్లీనర్‌కు తీవ్రగాయాలు



గాయపడిన క్లీనర్ హరీష్

**అనంతగిరి:** మండల కేంద్రం అనంతగిరిలో ప్రధాన రోడ్డుపై వెళ్తున్న లారీపై స్థానిక పీహెచ్‌సీ సమీపంలో చెట్టు విరిగిపడింది. ఈ ఘటనలో క్లీనర్ హరీష్ తీవ్రంగా, డ్రైవర్ అర్జున్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. బుధవారం అరకు నుంచి బొడ్డవర వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్యాబిన్‌లో డ్రైవర్ అర్జున్, క్లీనర్ హరీష్ క్యాబిన్‌లో చిక్కుకున్నారు. వీరిని వాహన చోదకులు బయటకు తీశారు. స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- కాశీపురంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ
- 108లో కేజీహెచ్‌కు తరలింపు– పరిస్థితి విషమం



కాశీపురం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాస్కరరావు

**దేవరాపల్లి:** కాశీపురం నూకాలమ్మ ఆలయ సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిని విజయనగరం జిల్లా రణస్థలం సమీపంలోని చిన్నబత్తి వలసకు చెందిన లండ భాస్కరరావు(28)గా అతని వద్ద లభించిన ఆధారాల మేరకు గుర్తించారు. బాధిత యువకుడికి కుడి కాలు, కుడి చేయి నుజ్జునుజ్జయ్యాయి. దీంతో సంఘటనా స్థలంలోనే యువకుడు అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రుడిని విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల కోసం దేవరాపల్లి పోలీసులను ఆశ్రయించగా ఇంకా కేసు నమోదు చేయలేదని, పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామన్నారు.

# బ్రాండెక్స్ బస్సుకు ప్రమాదం



ప్రమాదానికి గురైన వాహనం

**అచ్యుతాపురం(అనకాపల్లి):** అచ్యుతాపురం మండలంలోని బ్రాండెక్స్ మహిళా కార్మికులు వెళ్తున్న బస్సు మంగళవారం రాత్రి కుమారపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కార్మికులు గాయపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ బ్రాండెక్స్ బస్సుల్లో వేగ నియంత్రణ చేపట్టాలని, బస్సుల్లో ప్రయాణిస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు.

# గిరిరైతులకు అందుబాటులో సమాచార కేంద్రం



సమాచార కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్

**చింతపల్లి:** అంతరించిపోతున్న అరుదైన వ్యవసాయ పంటలు వాటికి సంబంధించిన విత్తనాల వివరాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వీలుగా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గిరిజన వ్యవసాయ సమాచార కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని చింతపల్లి ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేష్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ కేంద్రంలో వరిలో అంతరించిపోతున్న అరుదైన దేశీయ విత్తనాలతో పాటు ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. విత్తనాలను భద్రపరచడంతోపాటు జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా అంతరించిపోతున్న పంటలను తమ పరిశోధన క్షేత్రంలో సాగు చేసి వాటిని రైతులకు అందిస్తామని ఆయన తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**తుమ్మపాల:** జిల్లాలో హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు తప్పనిసరిగా ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి కె.అశోక్ బుధవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లకు రూ.300, హోంస్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోట్ ఆపరేటర్స్, ఎడ్వెంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్స్, వెల్‌నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాళ్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు రూ.500 చెల్లిస్తూ www.aptourism.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## సింహగిరిపై చందనం విక్రయాలు ప్రారంభం



చందనం ప్యాకెట్లు విక్రయిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

**సింహాచలం:** సింహగిరిపై చందనం విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గత నెల 23న చందనోత్సవం రోజు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై ఉన్న చందనాన్ని ఒలిచి, భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. ఆ చందనాన్ని భక్తులకు ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి ప్రసాద విక్రయశాల వద్ద ఉన్న క్యూల్లో భక్తులకు ప్యాకెట్లు విక్రయించారు. ఆలయ సూపరింటెండెంట్ అప్పలనాయుడు భక్తులకు ప్యాకెట్లు అందించారు. రోజుకు 1000 ప్యాకెట్లు చొప్పున ఒక ప్యాకెట్ 10రూపాయలకు విక్రయాలు జరపనున్నారు.

## రేపు అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

**సింహాచలం:** వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్వామికి రెండో విడత చందనం సమర్పణ, ఆరాధన, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం స్వామికి ఆస్థానమండపంలో పంచకలశ స్నపనం జరిపిస్తామని తెలిపారు.